క్లుప్తంగా

టీబీఏ పాలకమండలి సభ్యుడిగా నారాయణరావు



వరంగల్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ (పాలక మండలి సభ్యుడు)గా వరంగల్‌కు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ పీవీ.నారాయణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ హోటల్‌లో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సీఏ రితేష్‌మిట్టల్ ప్రకటించారు. ఈ సందర్భంగా నారాయణను పలువురు అభినందించారు.

అనాథ పిల్లలకు ఆర్థికసాయం



వరంగల్: తల్లిదండ్రులు లేని పిల్లలను మానవతా దృక్పథంతో చేరదీసి రూ.10వేల ఆర్థిక సాయం అందజేసి వారిని పాఠశాలలో చేర్పించి నగరానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బొల్లం శివ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. వరంగల్ కాశిబుగ్గకు చెందిన తల్లిదండ్రులు లేని ఇద్దరు పిల్లలు సాయి అద్విత్, శ్రీశాన్వి.. తమ అమ్మమ్మ ఓల్ల జ్యోతి దగ్గర ఉంటున్నారు. వారిని కాశిబుగ్గలోని నేషనల్ హైస్కూల్ చైర్మన్ దూలం పవన్‌తో బొల్లం శివ, సిలువేరు శ్రీను మాట్లాడి పిల్లలకు ఫీజు లేకుండా జాయినింగ్ చేయించారు.

18వ సారి రక్తదానం చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు



వరంగల్: దేశాయిపేట ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయుడు, సామాజిక సేవకుడు యువ నేతాజీ ఫౌండేషన్ ప్రధాన సభ్యుడు గజ్జెల సుమన్ రక్తదానం చేశారు. వరంగల్ ఎంజీఎం బ్లడ్ బ్యాంకులో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన బ్లడ్ డొనేషన్ క్యాంపులో 18వ సారి రక్తదానం చేసినట్లు సుమన్ తెలిపారు. ఈ సందర్భంగా సుమన్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో యువ నేతాజీ ఫౌండేషన్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్ కుమార్, కానిస్టేబుల్ స్విమ్మర్ రాజు, బొట్టు కమలాకర్, మునిగాల రాము, అలువాల పృథ్వీ, ఉప్పరపల్లి రాజ్ కుమార్, ముస్తఫా, గొల్లపల్లి శివకుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పుల్లా శ్రీనివాస్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకుడు పుల్లా శ్రీనివాస్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. పర్‌ఫార్మెన్స్ ఎవాల్యూయేషన్ ఆఫ్ పవర్ సెక్టార్ – ఏ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి శ్రీనివాస్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి నర్సింహచారి తెలిపారు. కామర్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ సక్రియా పర్యవేక్షణలో శ్రీనివాస్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

వాసవి క్లబ్ 'డాన్ టు డస్క్'



కాజీపేట: వాసవి క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ అనే కార్యక్రమాన్ని పురస్కరించుకుని కాజీపేట పట్టణంలో ట్రాఫిక్ పోలీసులకు లైఫ్ జాకెట్లు, విద్యార్థులకు నోటు పుస్తకాలు, వీధి వ్యాపారులకు గొడుగులను క్లబ్ అధ్యక్షుడు వెనిశెట్టి రఘు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ నాగబాబు, ఎస్సై సూర్యనారాయణ, క్లబ్ గవర్నర్ గంపా సాంబమూర్తి, మాదంశెట్టి సంపత్, చిదురాళ్ల కిశోర్, గన్ను శ్రీనివాస్, గన్ను రామానుజం, లావణ్య, సరిత, యాదగిరి, శ్యాంసుందర్, వాణి తదితరులు పాల్గొన్నారు.

గణేశుడి అలంకరణలో సంతాన లింగేశ్వర స్వామి

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయ ఆవరణలోని సంతానలింగేశ్వర స్వామిని శివ, గణేశుడి ఆకారంలో పండితులు శనివారం అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పండితుడు ఐనవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో సంతానలింగేశ్వరుడికి అభిషేకాలు, అర్చనలు జరిపించారు. మహాశివుడికి 21 లీటర్ల ఆవుపాలతో అభిషేకాలు చేశారు. ఆలయంలో సహస్ర నామార్చనలు నిర్వహించారు.

20న గ్రేటర్ బడ్జెట్ సమావేశం

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) 2024 –25వ సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 20న బల్దియా ప్రధాన కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సెక్రటరీ విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గ్రంథాలయాన్ని పట్టించుకునే వారేరి?

- కొన్నేళ్లుగా మూతబడి ఉంటున్న కాశిబుగ్గలోని లైబ్రరీ
- పట్టించుకోని అధికారులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న పాఠకులు



మూసిఉన్న కాశిబుగ్గ గ్రంథాలయం



డంపర్‌బిన్ పెట్టడంతో చెత్తాచెదారంతో అధ్వానంగా మారిన గ్రంథాలయ పరిసరాలు

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 20వ డివిజన్ కాశిబుగ్గలోని గ్రంథాలయం గత కొన్నేళ్లుగా మూతపడి ఉంది. దాంతో పాఠకులు తీవ్ర నిరాశకు గురవుతూ ఎప్పుడు తెరుస్తారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2005లో ఏర్పాటు

కాశిబుగ్గలోని కొంత మంది పెద్దలు కలిసి గ్రంథాలయాన్ని నెలకొల్పాలనే ఉద్దేశంతో ఇంటికి రూ.60 చొప్పున వసూలు చేసి రూ.10వేలు గ్రంథాలయ సంస్థలో డిపాజిట్ చేసి అప్పటి గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ పోలా నటరాజు, ఎమ్మెల్యే బస్వరాజు సారయ్య చేతుల మీదుగా 2005వ సంవత్సరంలో కాశిబుగ్గలో గ్రంథాలయాన్ని (బీడీసీ సెంటర్) ప్రారంభించారు. గ్రంథాలయ సంస్థ వారు రూ.500 ఇస్తే మడిపెల్లి రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఓ నిర్వాహకుడిని పెట్టి గ్రంథాలయాన్ని నడిపించారు. రమేష్ గౌడ్ పలువురి నుంచి సుమారు వేయి పుస్తకాలను సేకరించి కాశిబుగ్గ గ్రంథాలయాన్ని ఎంతో అభివృద్ధి చేశారు.

జిల్లాల విభజనతో..

2021వ సంవత్సరంలో వరంగల్ జిల్లాను హనుమకొండ, వరంగల్ జిల్లాలుగా విభజించడంతో గ్రంథాలయ సంస్థ హనుమకొండ జిల్లా పరిధిలోకి వచ్చింది. దాంతో పక్క జిల్లాకు సంబంధించి గ్రంథాలయాన్ని నిర్వహించబోమని చేతులెత్తేసి దాన్ని మూసి వేశారు.అప్పటి వరకు రోజూ రెండు వందల మంది పాఠకులు, విద్యార్థులు లైబ్రరీకి వచ్చి పుస్తక పఠనం, పేపర్లు చదివే వారు. అలాంటి గ్రంథాలయాన్ని గ్రంథాలయ సంస్థ వారు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఇప్పుడు అది శిథిలావస్థకు చేరింది. భవనం చుట్టూ చిరు వ్యాపారులు బండ్లు పెట్టి వ్యాపారం చేస్తూ పరిసరాలను చెత్తాచెదారంతో నింపుతున్నారు. ఇటీవల మున్సిపల్ అధికారులు గ్రంథాలయం వద్ద డస్ట్ బిన్ ఏర్పాటు చేయడంతో పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి జిల్లా కేంద్రంలో ఉన్న కాశిబుగ్గ గ్రంథాలయాన్ని తెరిపించాలని పాఠకులు, కాశిబుగ్గ వాసులు కోరుతున్నారు.

బక్రీద్ పర్వదినానికి ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జబ్బార్, అధికారులు



కాజీపేట: మాట్లాడుతున్న ఏసీపీ తిరుమల్ రావు

ఖిలా వరంగల్: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ ఫోర్ట్ రోడ్డు ఈద్గా మైదానంలో సోమవారం ఉదయం 9గంటలకు జరగనున్న ఈద్ – ఉల్ – జువా సామూహిక ప్రార్థనలకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు బల్దియా అధికారుల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను ముస్లిం, మైనార్టీ నేత, ఈద్గా ప్రతినిధి ఎంఏ.జబ్బార్‌తో కలిసి బల్దియా అధికారులు శనివారం పరిశీలించారు. మత గురువు మౌలానా అఫీజ్‌మహ్మద్ నోమాన్ రజా ఆధ్వర్యంలో ప్రార్థనలు జరగనున్నాయని జబ్బార్ తెలిపారు. సమావేశంలో ఈద్గా ప్రతినిధులు ఎండీ.చాంద్ పాషా, హుస్సైన్ అలీబేగ్, తాహేర్, యాకూబ్, ముఖ్దుం హైమద్, అమ్జద్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలి

కాజీపేట: ప్రశాంతమైన వాతావరణంలో బక్రీద్ పర్వదిన వేడుకలను ముస్లింలు జరుపుకోవాలని ఏసీపీ తిరుమల్ రావు సూచించారు. కాజీపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బక్రీదు రోజు ఖుర్బాని ఇవ్వడం చక్కటి ఆచారమన్నారు. కులమతాలకు అతీతంగా బక్రీద్ వేడుకలకు సహకరించాలని కోరారు. సమావేశంలో సీఐ వై.సుధాకర్ రెడ్డి, ఎస్సై లవన్ కుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులపై వేధింపులను అరికట్టాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

మడికొండ: వృద్ధులపై వేధింపులను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పిలుపునిచ్చారు. మడికొండలోని రైతు వేదికలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ గోపాలపురం ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు ఏదైనా సమస్య ఎదురైతే 100 నంబర్‌కు డయల్ చేసి సహాయం పొందవచ్చని సూచించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో వృద్ధులకు గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య, హనుమకొండ సీడీపీఓ మధురిమ, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, మడికొండ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, మూల అయిలయ్య, వంశీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

18నుంచి ఉచిత పేరిణి నాట్య శిక్షణ శిబిరం



వరంగల్: తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, వరంగల్ నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో పేరిణి నాట్యంలో ప్రత్యేక శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు అకాడమీ అధ్యక్షురాలు మోతుకూరి చంద్రకళరామకృష్ణ, అకాడమీ నాట్యాచార్యుడు గజ్జెల రంజిత్‌కుమార్ తెలిపారు. రామనాథపురిలోని పేరిణీ నృత్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 18నుంచి జులై 17వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 93930 04755, 70138 25078 నంబర్లలో సంప్రదించాలని కోరారు. సమావేశంలో ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల పేరిణి నృత్య అధ్యాపకురాలు చాతరాజు నవ్యజ, నృత్య కళాకారులు బండారి వైష్ణవి, మార్కల లోహిత్, పల్నాటి శ్రీజ, తోడసం గురుదేవ్, బండారి తేజస్విని, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు గుణపాఠం నేర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న గాదగోని రవి

వరంగల్ చౌరస్తా: కేంద్రంలోని ఎన్‌డీఏ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు గత ప్రభుత్వాల వైఫల్యాలను గుర్తించి గుణపాఠం నేర్చుకొని ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి డిమాండ్ చేశారు. వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంలోని ఓంకార్ భవన్‌లో రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నర్ర ప్రతాప్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాదగోని రవి మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఎన్నికలు ముగిసినందున హామీల అమలు కోసం ప్రజలు ఎంతో ఆశగా ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. వారి ఆశలు అడియాశలు కాకుండా కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. లేకుంటే ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల వాటా పెంచకపోతే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనం సుధాకర్, వస్కుల మట్టయ్య, కుంభం సుకన్య, గోనె కుమారస్వామి, ఎన్‌రెడ్డి హంసారెడ్డి, మైదంశెట్టి రమేష్, వస్కుల సైదమ్మ, గుండెబోయిన చంద్రయ్య, కంచ వెంకన్న, శ్రీనివాస్, మేక మోహన్ రావు, తుదుం అనిల్ కుమార్, గడ్డం నాగార్జున, కర్ర రాజిరెడ్డి, నాగెల్లి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎగ్ కార్ట్స్‌తో నిరుద్యోగులకు ఉపాధి



ఎగ్ కార్ట్స్ అందజేస్తున్న ప్రదీప్‌రావు, రమేష్

కాశిబుగ్గ: ఎగ్ కార్ట్స్‌తో నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జాతీయ కోడిగుడ్ల సమన్వయ సంఘం (ఎన్‌ఈసీసీ) వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సూచించారు. ఎన్‌ఈసీసీ సహకారంతో అందించిన ఎగ్ కార్ట్స్‌ను మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌తో కలిసి ఓసిటీలోని తన నివాస ప్రాంగణంలో 50మందికి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు మాట్లాడుతూ ఎన్‌ఈసీసీ జాతీయ అధ్యక్షురాలు అనురాధ దేశాయ్ డ్రీమ్ ప్రాజెక్ట్ ఎగ్ కార్ట్స్ స్కీమ్ అని, దీని ద్వారా నిరుద్యోగ యువత ఉపాధి పొంది కోడిగుడ్ల వినియోగం పెంపొందించాలని సూచించారు. ఎన్‌ఈసీసీ సీఓఓ డాక్టర్ ఏజిల్‌కుమార్ మాట్లాడుతూ తక్కువ ధరలో లభించే పౌష్టికాహారమైన కోడిగుడ్లను అందరూ తినాలని కోరారు. కార్యక్రమంలో వరంగల్ పౌల్ట్రీ ఫార్మర్ అసోసియేషన్ అధ్యక్షుడు మార్తినేని ధర్మారావు, టీపీఎఫ్ వరంగల్ రీజియన్ అధ్యక్షుడు రామారావు, ఎన్‌ఈసీసీ జోనల్ కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరెడ్డి, డబ్ల్యూపీఎఫ్ఏ ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్ రావు, కోశాధికారి రాంప్రసాద్, ఆవుల చంద్రయ్య, కర్ణాకర్‌రెడ్డి, రామారావు పాల్గొన్నారు.

'ప్రైవేట్'లో ఫీజులను నియంత్రించాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజులను నియంత్రించి, ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ ఎంఈఓ విజయ్ కుమార్‌కు విద్యార్థి సంఘం నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం శరత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అనుమతి లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను సీజ్ చేయాలని, ప్రైవేట్ పాఠశాలలో పాఠ్యపుస్తకాల దందాను గుర్తించి వాటిని సీజ్ చేయడంతో పాటు పటిష్టమైన ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మౌటం శివకుమార్, సంతోష్, మేకల అభిరామ్, ప్రభాస్, రాజు, సాయి తదితరులు ఉన్నారు.

డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలి



కేయూ క్యాంపస్: డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని బీఎస్ఎఫ్ విద్యార్థి కేయూ ఇన్‌చార్జ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ కోరారు. కాకతీయ యూనివర్సిటీలోని లైబ్రరీ ప్రాంతంలో శనివారం నిర్వహించిన విద్యార్థి, నిరుద్యోగుల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. ఇటీవల టెట్ పరీక్షలో ఉత్తీర్ణులై డీఎస్సీకి అర్హత సాధించిన అభ్యర్థులకు మూడు నెలల పాటు ప్రిపరేషన్‌కు గడువు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ, టెట్ సిలబస్‌లు వేర్వేరుగా ఉన్న అంశాన్ని దృష్టిలో ఉంచుకొని అభ్యర్థులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సూచించారు. సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు మహేందర్, మెడిపెల్లి ప్రవీణ్, భరత్, రాధిక, కవిత, నరేష్, కార్తీక్, బాలకృష్ణ, ఆఫీజ్, దిలీప్, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

మనోరంజకమైన పాటలతో మానసిక ప్రశాంతత



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జగదీష్‌బాబు, తదితరులు

హన్మకొండ కల్చరల్: మనోరంజకమైన పాటలతో మనిషికి మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యం కలుగుతుందని ప్రముఖ మానసిక వైద్యుడు జగదీష్‌బాబు తెలిపారు. హనుమకొండ పద్మాక్షిరోడ్డులోని జగదీష్ సంగీత కళానిలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'చక్రి సంగీత ప్రియులు' 'పాడాలని ఉందా' కరోకే క్లబ్ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు టీవీ రమేష్, ప్రధాన కార్యదర్శి నిమ్మల శ్రీనివాస్, కోశాధికారి సొగంటి మంజుల, సభ్యులు రావెళ్ల రామారావు, దేవిక, మాధవి, చంద్రశేఖర్, ఇమ్మాన్యుయేల్, ఉపేందర్, స్వప్న తదితరులు పాల్గొన్నారు. అనంతరం గాయకులు పాటలు పాడి అలరించారు.

కొనసాగుతున్న జర్నలిస్టుల క్రీడలు



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న జగన్‌మోహన్ రావు

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్ –2024లో భాగంగా ప్రెస్ క్లబ్ మీటింగ్ హాల్‌లో క్యారమ్, చెస్ పోటీలను టీజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ అన్నమనేని జగన్‌మోహన్‌రావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య అతిథులకు పరిచయం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, టీఎన్‌జీఓస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, నేతలు పి.వేణుగోపాల్, సోమయ్య, రాజేష్, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుడు, సీనియర్ జర్నలిస్ట్ కె.కృష్ణకుమార్ రెడ్డి, జర్నలిస్టులు పాల్గొన్నారు. అలాగే, ఆర్ట్స్ కళాశాల మైదానంలో క్రికెట్ మ్యాచ్‌లను సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, సీఐ నాగబాబు ప్రారంభించారు.

బాధిత మహిళలకు సఖి కేంద్రం అండ



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న వినీల

కాజీపేట: బాధిత మహిళలు, బాలికలకు సఖి సెంటర్ అండగా నిలిచి చేయూతనందిస్తోందని కేస్ వర్కర్ వి.వినీల తెలిపారు. కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి శిశు, సంక్షేమ శాఖలు సంయుక్తంగా సఖి వన్ స్టాఫ్ సెంటర్ ఆధ్వర్యంలో మహిళలకు శనివారం అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బాలికలు, యువతులు, మహిళలకు సఖి సెంటర్ అందిస్తున్న సేవలను వివరించారు. బాధిత మహిళలు ఆపదలో ఉన్నప్పుడు 181, 0870 – 2452112 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో హరిత, సరిత, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

'గురుకుల అభ్యర్థుల'కు పోస్టింగ్‌లు ఇవ్వాలి

విద్యారణ్యపురి: గురుకుల విద్యాసంస్థల్లో వివిధ కేటగిరీల్లోని ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు ఇచ్చిన ప్రభుత్వం.. పోస్టింగ్‌లు కూడా ఇవ్వాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వలీఉల్లాఖాద్రీ శనివారం ఒక ప్రకటనలో కోరారు. కొలువులకు సంబంధించిన నియామక పత్రాలు పొంది దాదాపు నాలుగు నెలలు కావస్తున్నా పోస్టింగ్‌లు ఇవ్వకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాలు, గిరిజన సంక్షేమ గురుకులాలు, బీసీ గురుకులాలు, మైనార్టీ గురుకులాల్లో 9వేల టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు టీజీటీ, పీజీటీ, పీడీ, లైబ్రేరియన్స్, జేఎల్, డీఎల్ కేటగిరీల్లో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈ ఏడాది ఫిబ్రవరిలో నియామక పత్రాలను సీఎం అందజేశారని గుర్తుచేశారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కేయూ క్యాంపస్: రక్తదానం దినోత్సవం సందర్భంగా ఈనెల14న హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ చేతుల మీదుగా ఉత్తమ ప్రజాసేవ అవార్డు అందుకున్న కేయూ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధి, వాకర్స్ ఇంటర్నేషనల్ చీఫ్ కోఆర్డినేటర్ దేశిని లక్ష్మీనారాయణను కేయూ దూరవిద్యా కేంద్రంలో శనివారం సన్మానించారు. దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ రాంచంద్రం, అధ్యాపకుడు డాక్టర్ జగన్, డాక్టర్ సుభాష్, వాకర్స్ దేశిని తిరుపతి, అశోక్, నవీన్, రాజు, టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా జనరల్ సెక్రటరీ పూజారి మనోజ్ పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

హన్మకొండ: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కలిశారు. ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, నాయకుడు బీరవెల్లి భరత్ కుమార్ రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ప్రస్తుత, భవిష్యత్తు రాజకీయాల గురించి చర్చించారు.

నేడు వీహెచ్‌పీఎస్ సమావేశం

హన్మకొండ: వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) హనుమకొండ, వరంగల్ జిల్లాల సమావేశాన్ని ఈనెల 16న నిర్వహించనున్నట్లు సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెపాక శంకర్ తెలిపారు. హనుమకొండలో జరగనున్న ఈ సమావేశాన్ని వికలాంగులు విజయవంతం చేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. సమావేశానికి వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత, కోర్ కమిటీ చైర్మన్ ఎల్.గోపాల్, వైస్ చైర్మన్ రాంబాబు, రాష్ట్ర కన్వీనర్ కాళ్ల జంగయ్య హాజరవుతారని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

హన్మకొండ: జయశంకర్ భూపాలపలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులోని విజ్ఞానజ్యోతి పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం హనుమకొండ స్నేహనగర్‌లోని ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగింది. 1998 –1999లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఒకచోట కలుసుకుని నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కుటుంబ విషయాలు, యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అప్పటి గురువులు నర్సింగరావు, దేవేందర్ రావు, మల్లయ్య, బొజ్జ సురేందర్, సురేందర్, చక్రధర్, సుధాకర్, సూర్యనారాయణ, లక్ష్మారెడ్డి, యాదగిరిని సన్మానించారు.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి శివనగర్‌లో ఓ యువతి అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ శివనగర్‌కు చెందిన రామోజు సంపత్, కల్యాణి దంపతుల కుమార్తె రవళి (22) శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దాంతో బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించ లేదు. యువతి తండ్రి రామోజు సంపత్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

వేతన సవరణ జీఓపై ఉద్యోగుల హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వరంగల్ అర్బన్: బల్దియాకు చెందిన వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల వేతనాల ఖరారుపై ఇటీవల జారీ చేసిన జీఓను సవరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఐఎన్‌టీయూసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు, మేయర్ చిత్రాలతో కూడిన ఫ్లెక్సీకి శనివారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు పుల్ల రమేష్, ప్రధాన కార్యదర్శి పాశం రవియాదవ్, మేకల దేవేందర్ యాదవ్, డ్రైవర్ యూనియన్ అధ్యక్షుడు పైడయ్య, నాయకులు గణేష్, సమ్మయ్య, వీరయ్య, సుధాకర్, శ్రీను, మేకల సమ్మయ్య యాదవ్, నరేందర్, యుగేందర్, ఆరోగ్యం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ ప్రవీణ్

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 35వ డివిజన్‌లో పేరుకుపోయిన పలు విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఈమేరకు శివనగర్ సబ్‌స్టేషన్ ఏఈ తరుణ్‌కుమార్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో పలు విద్యుత్ సమస్యలు ఉన్నాయని వివరించారు. వానకు, బలమైన గాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని పేర్కొన్నారు. డివిజన్‌లోని పుప్పాల గుట్ట, లక్ష్మీగణపతి కాలనీ, ఏసీరెడ్డినగర్ జంగాలవాడలో విద్యుత్ స్తంభాలు కుంగిపోయి ప్రమాదకరంగా ఉన్నాయని తెలిపారు. అలాగే, డివిజన్‌లోని చాలామందికి జీరో బిల్లు రావడం లేదని అన్నారు.

డ్రైవర్లు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



హన్మకొండ: ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేయడం ఎంత ముఖ్యమో టాక్సీ డ్రైవర్లు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడమూ అంతే ముఖ్యమని డాక్టర్ సిద్ధార్థ, సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. హనుమకొండ హౌసింగ్ బోర్డు కాలనీలోని రుద్రమదేవి టాక్సీ డ్రైవర్ యూనియన్‌లోని సభ్యులకు స్మైల్ ఫౌండేషన్ సంచార వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డ్రైవర్స్ యూనియన్ ప్రతినిధులు గుగులోతు రామోజీ, రమేష్, సంచార వైద్యశాల సిబ్బంది కమలాకర్, సైమస్, అక్షిత, సోఫియా పాల్గొన్నారు.